క్లుప్తంగా

పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ

గుడివాడటౌన్: పురపాలక సంఘ పరిధిలో ఇంటిపన్ను, కుళాయిపన్ను బకాయి ఉన్న వారికి ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఈనెల 31వ తేదీ వరకు పన్ను బకాయిలు స్వీకరిస్తామన్నారు. ఆదివారం కూడా పన్ను చెల్లించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు బకాయిలు ఉన్న మొత్తం ఒకే పర్యాయం చెల్లించే వారికి వడ్డీ మాఫీ చేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగ పర్చుకోవాలని ఆయన కోరారు.

రాహుల్‌పై కక్షసాధింపు తగదు

ముదినేపల్లి రూరల్ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై బీజేపీ కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం తగదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంగినేని బాబ్జీ అన్నారు. ముదినేపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఇటీవల చేపట్టిన పాదయాత్రకు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన విశేష స్పందన చూసి బీజేపీలో ఓటమి భయం మొదలైందన్నారు. దీంతో కోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దుచేసేందుకు తెగించడం దారుణమైన చర్యగా అభివర్ణించారు. బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా రాహుల్ గాంధీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధిస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

విజేతలకు బహుమతులు



గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాల 41వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పరీక్షలలో ఆటల పోటీల్లో వివిధ కార్యక్రమాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అకాడమీ డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.నాగు, ఏఓ తుమ్మల వెంకట రమణ, లోయ రాజా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలి వెళ్లిన నేతలు




మండవల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా ప్రోగ్రాం దెందులూరుకు వచ్చిన నేపథ్యంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పెద్దఎత్తున బస్‌లపై శనివారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, మెండా సురేష్ తదితరులు పాల్గొన్నారు. కానుకొల్లు తదితర గ్రామాల నుంచి పార్టీ నాయకులు సీఎం ప్రోగ్రాంకు దెందులూరు వెళ్లారు.

కైకలూరు నియోజకవర్గం నుంచి..



కైకలూరు : వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమానికి ఏలూరు జిల్లా దెందులూరుకు శనివారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభకు కైకలూరు నియోజకవర్గం నుంచి భారీగా అభిమానులు, మహిళలు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆధ్వర్యంలో నాలుగు మండలాల నుంచి ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లారు. ఆయా మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు బస్సులను ప్రారంభించారు. కైకలూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద బస్సులను ఎంపీపీ అడవి కృష్ణ ప్రారంభించారు.

కుంగిన వంతెన



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి నుంచి కాకరవాడ శివారు దేవరం వెళ్లే రహదారిలో అన్నవరం డ్రైయిన్‌పై ఉన్న వంతెన పూర్తిగా కుంగిపోయింది. దీనిని నిర్మించి 70 ఏళ్లు కావస్తుండగా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దేవరం, కాకరవాడ గ్రామాల్లో ఉన్న చేపల చెరువులకు సంబంధించి భారీ వాహనాలపై మేతలు తీసుకువెళ్లేందుకు ఈవంతెనే ఏకైక మార్గం. దీంతో శిథిలావస్థకు చేరిన ఈ వంతెన ఎప్పుడు కూలుతోందననే భయాందోళనలు స్థానికుల్లో నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో శుక్రవారం ఈ వంతెనకొంతమేరకుంగిపోగా శనివారం మరింత కుంగిపోయింది. ద్విచక్రవాహనాలు ఒక వైపు నుంచి వెళ్లేందుకు అవకాశం ఉంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- రూ.2.5కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కోసూరు(మొవ్వ): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. కోసూరు పరిసర ప్రాంతాల్లోని 10 గ్రామాల రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా 24 గంటలు త్రీఫేస్ కరెంటు అందుబాటులో ఉంచే విధంగా రూ.2.5కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించటం ఆనందదాయక మని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మొవ్వ మండలం కోసూరులో ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, పామర్రు శాసన సభ్యుడు కై లే అనిల్ కుమార్ భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ నిధులు రూ.12 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పెనుమూడి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ ఉచిత విద్యుత్ అందుబాటులో ఉంటేనే రైతులు ముందుకు సాగుతారని గుర్తించి అమలు చేస్తున్నామన్నారు. అలాగే రూ.2 కోట్ల వ్యయంతో ఎంపీ నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ సంయుక్త నిధులతో రానున్న రెండు నెలల్లో డొంక రోడ్డులు అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడించారు. ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గ పరిధిలో పెదపారుపూడి మండలంలోని దోసపాడులో, మొవ్వ మండలం కూచిపూడిలో రెండు నూతన విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు.

రెండు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు

కోసూరు గ్రామంలోని ప్రజలు కమ్యూనిటీ హాలు నిర్మించాలని విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎంపీ బాలశౌరి ఎంపీ గ్రాంట్స్ నుంచి రూ.10 లక్షలు ఇస్తామని ప్రకటించారు. గ్రామంలోని బీసీ ఏరియాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలను మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీటీసీ కొండేటి ఇందిర పీఏసీఎస్ ఛైర్మన్ జొన్నలగడ్డ వీరకుమారి, పార్టీ మండలాధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోగినేని పెరుమాళ్లు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో రూ.35 లక్షలతో కమ్యూనిటీ హాల్..

తోట్లవల్లూరు: ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. స్థానిక కలాసుమాలపల్లిలో కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు రూ.35 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి శనివారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి బాలశౌరి, అనిల్‌కుమార్ పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలన్నారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని బాలశౌరి చెప్పారు. ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్‌కు అండగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

జన్మభూమి కమిటీలతో టీడీపీ అరాచకం..

గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలతో ఆ పార్టీ నాయకులు చేసిన అరాచకాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ విమర్శించారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగన్‌దేనన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోర్ల రామచంద్రరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాఘవరావు, నాయకులు పీఎస్ కోటేశ్వరరావు, కిలారం రామకృష్ణ, నక్కా సత్యన్నారాయణ, ఈడ్పుగంటి రూబెన్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తృణ ధాన్యాలతో ఆరోగ్యం

మహిళాశిశు సంక్షేమ శాఖ పీడీ సువర్ణ



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ

పామర్రు: తృణ ధాన్యాలను తీసుకుంటే మంచి ఆరోగ్యంతో పాటు శారీర సౌష్టవం ఏర్పడుతుందని మహిళాశిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్ సువర్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పామర్రు ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు తృణధాన్యాలు–సిరిధాన్యాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యం ఉన్నవారే కాదు ఆరోగ్యంగా ఉన్నవారు కూడా ఈ చిరుధాన్యాలను తీసుకోవడం మంచిదన్నారు. అధిక పోషకాలు గల చిరుధాన్యాలను వాడితే శరీర ఆకృతి చక్కగా మారుతుందన్నారు. వీటి వాడకం వలన గుండెపోటు, రక్త పోటు రావని, శరీరం త్వరగా అలసి పోవటం జరగదన్నారు. చిరుధాన్యాలు వాడకం వలన పాస్పరస్, పోటాషియం, నియాసిన్, కాల్షియంలు ఉత్పత్తి అవుతాయని అన్నారు. రోజుకు సుమారు 250 గ్రాముల చిరుధాన్యాలను ప్రతి ఒక్కరూ తీసుకోవటం మంచిదని అన్నారు. మహిళల సమస్యలకు గోంగూర కషాయం, కొత్తిమీర, పుదీనా, నిమ్మగడ్డి, రాగి పాత్రలలో నీరు సేవించడం మంచిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వీ భానుశ్రీ, సూపర్‌వైజర్లు పుణ్యావతి, విజయకుమారి, పామర్రు, పెదపారుపూడి, గుడ్లవల్లేరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక ప్రజావేదిక



ప్రజావేదికపై ఎంపీపీ రాజామణి, ప్రిసైడింగ్ అధికారి శ్రీలత, ఎంపీడీఓ

తోట్లవల్లూరు: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు మెరుగైన ఉపాధి చూపాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2021–22 సంవత్సరాలకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం జరిగింది. గ్రామాల వారీగా తనిఖీ బృందాల ప్రతినిధులు నివేదిక వివరాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 310 పనులు నిర్వహించటం ద్వారా 7142 పనిదినాలు కల్పించి, రూ.6.38 కోట్లు ఖర్చు చేశామని ఎంపీడీఓ తుంగల స్వర్ణలత తెలిపారు. చిన్న చిన్న పొరపాట్ల ద్వారా అదనపు చెల్లింపులు జరిపిన రూ.5,334 నగదు రికవరీకి ఆదేశించారు. ప్రిసైడింగ్ అధికారి శ్రీలత, వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, ఏపీడీ నాంచారరావు, ఎస్ఆర్పీ సత్యన్నారాయణ, ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

పామర్రు (పమిడిముక్కల): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న ప్రభుత్వ కృషి అభినందనీయమని తాడంకి గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి అన్నారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామ బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో గ్రామం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బీసీ కాలనీలో రోడ్డు బాగోలేదని గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ వెంటనే రహదారి ఏర్పాటుకు రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో సుమారు 170 మీటర్ల సీసీ రోడ్డు పనులు నిర్వహిస్తున్నామన్నారు. సీసీ రహదారిని పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అన్నారు. వార్డు మెంబర్లు రమేష్, నాగలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

గుంటూరు బాపనయ్యకు ఘన నివాళి



బాపనయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుడివాడటౌన్: సామాజిక అసమానతలను నిర్మూలించేందుకు అవిరళ కృషి చేసిన గొప్ప నాయకుడు గుంటూరు బాపనయ్య అని సీపీఎం నాయకులు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామాజిక అసమానతలను నిర్మూలించేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయం అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సమరం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రాజేష్, వేశపోగు యెషయ్య, బి.అరుణ, ఎండీ శౌకతున్నీసా, ఎండీ హఫీజ్, పి.వీరమ్మ, పి.రజిని, ఎ.విజయ కుమార్, దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

గుడ్లవల్లేరు: నెహ్రూనగర్ గ్రామానికి చెందిన మాతంగి మురళి చికిత్స పొందుతూ మృతి చెందగా శనివారం మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను వైఎస్సార్ బీమా కింద మృతుని భార్యకు అందజేశారు. వివరాలను ఎంపీడీఓ వి.దిలీప్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు–2 ఎంపీటీసీ సభ్యురాలు పెనుమాల పూర్ణ కవిత, గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు, ఏపీఎం సాంబమూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ మౌనిక, వలంటీర్ జి.శిరీష తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

పశుసంవర్ధక శాఖ ఏడీ నరసింహారావు



టీకాల కార్యక్రమంలో పశువైద్యులు

గుడివాడటౌన్ (నందివాడ): గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు పాల దిగుబడి తగ్గడంతో పాటు నీరసించిపోతాయని పశుసంవర్ధక శాఖ యలమర్రు సబ్ డివిజన్ సంచాలకులు డాక్టర్ జీవీ నరసింహారావు అన్నారు. నందివాడ గ్రామంలో శనివారం జాతీయ గాలికుంటు వ్యాధి నివారణా పథకం అమలులో భాగంగా గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అన్ని గ్రామాల్లో ఉచితంగా టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు డాక్టర్ ఎస్.లలితశ్రీ, డాక్టర్ రమ్య, నందివాడ సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు సరెళ్ల నాగేశ్వరరావు, పశుపోషకులు పాల్గొన్నారు.

యలమర్రు(పెదపారుపూడి): పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఇంటింటికీ తిరిగి ఉచితంగా వేస్తున్న టీకాలను పశుపోషకాలు సద్వినియోగం చేసుకోవాలని యలమర్రు పశువర్ధక శాఖ ఏడీ జీవీ నరసింహారావు అన్నారు. మండలంలోని యలమర్రులో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఏప్రిల్ 24వ తేదీ వరకు గ్రామాల్లో ఉన్న పశువులకు ఇంటి వద్దకు వచ్చి పశువైద్యులు ఉచితంగా టీకాలు వేస్తారన్నారు. గాలికుంటు వ్యాధి నివారణకు ఖచ్చితంగా టీకాలు వేయించుకోవాలని పాడి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొల్లూరి అనూష, పశువైద్యులు జయంత్, అనిత, పశువుల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కనుమూరు (పామర్రు): జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మండలంలోని కనుమూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా జమీ దగ్గుమిల్లి పశువైద్యులు రామాంజనేయులు మాట్లాడుతూ నూరుశాతం టీకాలను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే నెల 24వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మండలంలో పశు పోషకులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వీరభద్రం, సాయిరెడ్డి, వంశీకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో కాలువ తవ్వకం పనులు



మండవల్లి: మండలంలోని నుచ్చుమిల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా శనివారం కాలువ తవ్వకం పనులు నిర్వహించారు. రూ.లక్షా 60 వేల నిధులతో చేపడుతున్న పనులను 72 మంది కూలీలు చేస్తున్నారు. ఉపాధి పనుల ద్వారా రైతుల పంట కాలువలు అభివృద్ధి చెంది సాగునీటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. ప్రజల తాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసు కోవాలని ఎంటీఏ నవీన్ కోరారు. ఎఫ్ఏ పాల్గొన్నారు.

నూరు శాతం పన్ను వసూలు

గుడ్లవల్లేరు: ఉలవలపూడి గ్రామ సచివాలయ పరిధిలో నూరు శాతం ఇంటి పన్ను వసూళ్లను చేశారు. రూ.65 వేలు పన్ను వసూలు చేసినట్లు ఆ గ్రామ కార్యదర్శి ఎ.జె.ఎల్.నరసింహారావు శనివారం తెలిపారు. నూరు శాతం వసూలు చేసిన సచివాలయ సెక్రటరీ రజియాబేగంను గ్రామ సర్పంచి పామర్తి భాస్కరరావు అభినందించారు.

సందడిగా సాగిన వీడ్కోలు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

పామర్రు: స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్‌లో శనివారం ఫేర్ వెల్ పార్టీ సందడి నెలకొంది. హైస్కూల్‌లోని 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుతూ బహుమతులను అందించారు. విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శర్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దళిత క్రైస్తవులు

గుడివాడటౌన్: దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం అభినందనీయమని వైఎస్సార్ సీపీకి చెందిన దళిత క్రైస్తవ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు జగన్ మోహనరెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా మతం మారిన దళితులు రిజర్వేషన్లలో, ఇతర ప్రయోజనాలలో నష్టపోతూ వస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యదేశంలో మతాన్ని పరిగణలోకి తీసుకుని రిజర్వేషన్లు అమలు చెయ్యడం సరికాదన్నారు. దీనిపై సుప్రీంకోర్టు రాష్ట్రాల సమ్మతి కోరగా క్రైస్తవుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని అందుకు కృషిచేసిన జగన్ మోహనరెడ్డికి దళిత క్రైస్తవులు రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేటి విలియం జోషి, వెంపటి సైమన్, మట్టా జాన్ విక్టర్, తంటేపూడి అనిల్, మామిళ్ల ఎలీషా, కె.దిలీప్, సునీత, దేవి, జోషి తదితరులు పాల్గొన్నారు.

ద్వాక్రా మహిళల్లో ఆనందం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ద్వాక్రా మహిళలు

తోట్లవల్లూరు: వైఎస్సార్ ఆసరా నిధుల విడుదలతో డ్వాక్రా మహిళల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. బొడ్డపాడు, చినపులిపాక గ్రామ సచివాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎంపీటీసీ సభ్యురాలు దారం రోజారాణి, డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. మండల వ్యాప్తంగా 810 డ్వాక్రా గ్రూపులకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.8.13 కోట్లు జమ కానున్నాయని ఏపీఎం కృష్ణంరాజు తెలిపారు. వల్లూరుపాలెం ఆర్‌బీకేలో వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల కార్యక్రమాన్ని టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని డ్వాక్రా మహిళలు వీక్షించారు.

ఎఫ్ఎఫ్‌సీఐ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌కుమార్



ఏలూరు జిల్లా ఎఫ్ఎఫ్‌సీఐ నూతన కార్యవర్గ సభ్యులు

కైకలూరు (కలిదిండి): ఫ్రీడమ్ ఫర్ క్రిస్టియన్ ఇంటిగ్రిటీ క్రిస్టియన్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఫ్‌సీఐ) ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా నంబూరి పాల్ అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. కలిదిండి మద్వానిగూడెం బైబిల్ మిషన్ చర్చి ఆవరణంలో ఏలూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. ఏలూరు జిల్లా పొలిటికల్ అధ్యక్షుడిగా ఫాదర్ ప్రకాష్, కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రావు, కలిదిండి మండల అధ్యక్షుడిగా బత్తిన షారోన్ పీటర్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌సీఐ నేషనల్ ప్రెసిడెంట్ పుట్టా పీటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెల్ఫేర్ ప్రెసిడెంట్ ఎండీ ఇస్మాయిల్, పశ్చిమగోదావరి జిల్లా ఎఫ్ఎఫ్‌సీఐ ప్రెసిడెంట్ స్టాన్లీ థామస్, వైస్ ప్రెసిడెంట్ యోవేలు రాజు, సెక్రటరీ చిరంజీవి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.

కాంగ్రెస్ నేతల నిరసన

కైకలూరు: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ కైకలూరు తాలూకా సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు శనివారం ఆందోళన చేశారు. బీజేపీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కైకలూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా నాగరాజు గౌడ్, కైకలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మంగినేని బాబ్జి, మండవల్లి, కలిదిండి మండలాల పార్టీ అధ్యక్షుడు సోము కాశీ విశ్వనాథ్ కేశిరెడ్డి శివరామకృష్ణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిరాల సంజీవరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత నవరాత్రి పూజలు

బంటుమిల్లి: స్థానిక శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఉగాది పండుగ రోజు నుంచి ప్రారంభమైన పూజలు తొమ్మిది రోజులు జరుగుతాయని అర్చకుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 30వ తేదీన జరగనున్న సీతారామ కల్యాణం సందర్భంగా శనివారం భక్తులు పసుపు కొట్టి కల్యాణోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. రోజూ సాయంత్రం మహిళా భక్తులు విష్ణు సహస్రనామ పారాయణ, వేంకటేశ్వర గానామృతం తదితర స్తోత్రాలను పారాయణ చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారి ప్రధాన మూర్తులను సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి వైఎస్సార్ ఆసరా సంబరాలు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు చేర వేసేందుకు నగరంలోని పలు డివిజన్లలో సంబరాలు నిర్వహిస్తున్నామని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.